క్లుప్తంగా

మారిషస్ పైనాపిల్ సాగుపై శిక్షణ



పోలీస్‌కోటలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీహెచ్‌ఓ గణేష్, హెచ్‌ఓ జయశ్రీ

భామిని: ఐటీడీఏ పరిధిలో కొత్తగా సాగు చేయనున్న మారిషస్ పైనాపిల్ పంటపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పోలీస్‌కోట, నల్లరాయిగూడలలో ఆదివాసీ గిరిజనులకు వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐటీడీఏ పీహెచ్‌ఓ గణేష్, హెచ్‌టీఓ జయశ్రీ సాగుపై అవగాహన కల్పించారు. ఐటీడీఏ నుంచి 90 శాతం రాయితీపై బ్యాటరీ స్ప్రేయర్లు, నీమ్ ఆయిల్, వేపపిండి అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బిడ్డిక నారాయణ, వెలుగు డైరెక్టర్ బి.సంజీవరావు, మహిళా పోలీస్ బి.క్రాంతి, వెలుగు అసోసియేషన్ సిబ్బంది, గిరిజన రైతులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల డిమాండ్లు పరిష్కరించాలి



కురుపాం ఎంపీడీఓ ఉమామహేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ కురుపాం మండలానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు కురుపాం ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరికి గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అర్హత, అనుభవం కలిగిన వారికి ఉద్యోగోన్నతి కల్పించాలని, మండల స్థాయిలో బదిలీల అవకాశం కల్పించాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణిస్తే సంబంధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా రూ.10లక్షలు చెల్లించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ ఫీల్డ్ అసిస్టెంట్ల డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లానన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఈ రోడ్డును నిర్మించినట్టు తెలిపారు. పీఆర్ ఈఈ రవి, ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి వాలీబాల్ టోర్నమెంట్

సీతంపేట: ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా దోనుబాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎస్సై మస్తాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీలోగా క్రీడాకారులు దోనుబాయి పోలీస్‌స్టేషన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో కిటకిటలాడిన లక్ష్మీనృసింహ స్వామి ఆలయం

సీతానగరం: మండల కేంద్రంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి భక్తులు గురువారం పోటెత్తారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ముడుపుల పూజలు చేసేందుకు ఆలయ ప్రాంగణమంతా భక్త సందోహంతో నిండి పోయింది. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఫైలేరియా కిట్ల పంపిణీ

బలిజిపేట: పెదపెంకిలో ఫైలేరియా వ్యాధితో బాధపడుతున్న వ్యాధిగ్రస్తుల కుటుంబాలకు మోరబీడీటి మేనేజ్‌మెంట్ కిట్లు సర్పంచ్ పాపారావు, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవి కుమర్ గురువారం పంపిణీ చేశారు. జిల్లా మలేరియా కార్యాలయం నుంచి వచ్చిన వీటిని పంపిణీ చేసినట్టు వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి తెలిపారు. ఒక కిట్టులో ఒక సబ్బు, తువ్వాలు, స్కిన్ ఆయింట్‌మెంట్, ఒక మగ్గు ఉంటాయని పేర్కొన్నారు. వ్యాధిగ్రస్తులు పాడైన భాగాన్ని శుభ్రం చేసుకునేందుకు అనుకూలంగా ఈ కిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. బాధితులు వాటిని ఏ విధంగా వినియోగించుకోవాలనే దానిపై వారికి అవగాహన కల్పించారు. ప్రతీ రోజు తప్పనిసరిగా పరిశుభ్రం చేసుకోవడం వలన వ్యాధిని నియంత్రించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు, ఎంఎల్‌హెచ్ సత్యవతి, జ్యోతి, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

కియోస్కో సేవలకు మంగళం

- ఆర్‌బీకేల్లో మూలకు చేరిన యంత్రాలు

గరుగుబిల్లి:

రైతు సంక్షేమమే లక్ష్యంగా అన్ని రకాల సేవలను స్థానికంగా అందుబాటులో ఉంచేందుకుగాను రైతు భరోసా కేంద్రాల్లో కియోస్కో యంత్రాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. వీటి ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందించేవారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, అపరాలు తదితరమైనవి కొరత లేకుండా నాణ్యమైన వాటిని నిర్దేశించిన ధరకు రైతులకు అందించేవారు. ఈ యంత్రాల ద్వారా రైతులకు కావల్సిన సమాచారాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకొనేలా చేయడంతో రైతులకు ఎంతో ఉపయోగపడేది. ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులను పూర్తిగా విస్మరించడంతో అన్నదాతల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఆర్‌బీకేలను రైతు సేవా కేంద్రాలుగా మార్చినప్పటికీ సేవల కొనసాగింపులో మాత్రం కూటమి ప్రభుత్వం వివక్షతను చూపుతుంది. గతంలో ఏర్పాటు చేసిన కియోస్కో యంత్రాలు సైతం నిర్వహణ లేక సేవలు దాదాపు నిలిచిపోయాయి.



గరుగుబిల్లిలో నిరుపయోగంగా ఉన్న కియోస్కో యంత్రం

సాంకేతిక సమస్యలతో..



రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కియోస్కో మిషన్లు సాంకేతిక సమస్యల కారణంగా పని చేయడం లేదు. పని చేయని కియోస్కో యంత్రాల గూర్చి ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందజేశాం. కియోస్కో యంత్రాలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపడతాం.

– ఆర్.విజయభారతి, ఏఓ

నియోజకవర్గంలో..

కురుపాం నియోజకవర్గంలోని గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి, కొమరాడ, కురుపాం మండలాల్లోని ఆర్‌బీకేల్లో 98 కియోస్కో యంత్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కియోస్కో మిషన్లను ఎరువుల పంపిణీకి వినియోగించి మిగతా సేవలకు దూరం చేశారు. కియోస్కో యంత్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల ధరలు, రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, సమీప మార్కెట్‌లోని వివరాలు కియోస్కోలో సమాచారం ఉండేది. అలాగే వాతావరణం సమాచారం, వాతావరణంలో మార్పులు, ఏ సీజన్‌లో ఏ పంటను సాగు చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చో తదితర సమాచారం ఉండేది. ప్రస్తుతం ఈ యంత్రాలు మూలకు చేరడంతో రైతులకు సేవలు కూడా అందని పరిస్థితి నెలకొంది. లక్షల రూపాయల విలువైన యంత్రాలు నిర్వహణ లేక నిరుపయోగంగా ఉన్నాయి. కొన్ని చోట్ల యంత్రాలు పని చేస్తున్నప్పటికీ ఇంటర్నెట్ లేదంటూ సేవలను నిలిపివేశారు. ప్రభుత్వ చర్యలు కారణంగా కోట్లాది రూపాయల ప్రజాధనం నిరుపయోగంగా మారింది. ఆర్‌బీకేలో కియోస్కో సేవలను రైతులకు అందుబాటులోకి తీసుకొని రావాలని పలువురు రైతులు కోరుతున్నారు.

బిల్లుల సమస్య తీరింది..



వీరఘట్టం: ప్రస్తుత వేసవి కాలంలో విద్యుత్ వినియోగం బాగా పెరిగింది. దీంతో వినియోగం పెరిగిన మీటర్లకు బిల్లులు జనరేట్ కాకపోవడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ఈ వ్యవహారంపై సాక్షిలో 'జనరేట్ కాని విద్యుత్ బిల్లులు' శీర్షికన గురువారం కథనం ప్రచురితమైంది. దీంతో ట్రాన్స్‌కో అధికారులు స్పందించి సాంకేతిక లోపాన్ని సరిచేయడంతో బిల్లులు జనరేట్ అయ్యాయి. వినియోగదారులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు.



సాక్షి

జనరేట్ కాని విద్యుత్ బిల్లులు

సాక్షిలో ప్రచురితమైన కథనం

కూటమి నాయకులు ఇబ్బంది పెడుతున్నారు..!

- గోడు వెల్లబోసుకున్న వేతనదారులు

పాలకొండ రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఉపాధి వేతనదారులపై స్థానిక నాయకులు కక్ష సాధిస్తున్నారని మండలంలోని ఎల్ఎల్ పురం గ్రామానికి చెందిన వేతనదారులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు సర్పంచ్ ద్వారపూడి సావిత్రమ్మ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కుమార్‌ను గురువారం కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా వేతనదారులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ పరిధిలో మూడు వందల మంది వేతనదారులు పనులపై ఆధారపడి కుటుంబాలను నెట్టుకొస్తున్నారన్నారు. ఆరుగురు మేట్ల పర్యవేక్షణలో కాలువ, ఫారంపాండ్స్ వంటి పనులు చేస్తున్నామని వేతనదారులు చల్లా పార్వతి, సుశీల, భవానీ, నక్క ఆనంద్, ఎస్.విశ్వనాథం, తదితరులు తెలిపారు. అయితే కూటమి నాయకులు పాత మేట్లను తొలగించి, కొత్తవారిని నియమించడానికి ప్రయత్నిస్తున్నారని, ఈ క్రమంలో పనులు చేపట్టడం లేదని ఆరోపించారు. సుమారు పది రోజులుగా పనులు జరగనివ్వడం లేదన్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని వేతనదారులు కోరారు.



సమస్యను వివరిస్తున్న ఉపాధి వేతనదారులు

గర్భిణులకు అన్న సమారాధన

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో గర్భిణులకు అన్నదాన కార్యక్రమం గురువారం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీలో పీఎంఎస్ఎంఏ పథకం కింద ప్రతీ నెలా తనిఖీల కోసం వచ్చిన గర్భిణులకు దూరభారం కావడంతో సకాలంలో ఇంటికి చేరుకోలేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని గమనించిన మండలంలోని బురద వెంకటాపురం గ్రామానికి చెందిన బొత్స శ్రీహరిరావు, ఇంద్రాణి దంపతులు అన్నదానం ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు. ఆలయంలో దాతల సహకారంతో గర్భిణులకు అన్నదానం ఏర్పాటు చేయడంపట్ల స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సంతోష్‌కుమార్ అభినందించారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణులు

విద్యార్థినుల ఆరోగ్యంపై దృష్టి

- జిల్లా మలేరియా నివారణ అధికారి సత్యనారాయణ



ఆశ్రమ పాఠశాల సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి

పాలకొండ రూరల్: విద్యార్థినుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి సత్యనారాయణ అన్నారు. మండలంలోని బద్దుమాసింగి గిరిజన ఆశ్రమ పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. అనంతరం మలేరియా జ్వర లక్షణాలు, నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. చిన్నపాటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈయన వెంట హెచ్‌ఎం చలపతిరావు, ఏఎన్‌ఎం టి. రామలక్ష్మి, హెచ్‌వీ హైమావతి, ఆశా కార్యకర్తలు నీలవేణి, శారద, చామంతి, తదితరులు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

పాలకొండ: సారా తరలిస్తున్న వ్యక్తిని గురువారం అరెస్ట్ చేశామని ఎక్సైజ్ సీఐ సూర్య కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన కల్లేపల్లి కృష్ణ సారాతో పట్టుబడగా అరెస్ట్ చేశామని, అలాగే ఐదుగురు బెల్లం వ్యాపారులను అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచగా బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

విశ్వాసుల పాదయాత్ర

పార్వతీపురం: క్రైస్తవ విశ్వాసులకు ఎంతో పవిత్రమైన గుడ్ ఫ్రైడేని పురస్కరించుకొని 45రోజులు ముందు నుంచి ప్రత్యేక ప్రార్థనలు, దీక్షలు విశ్వాసులు భక్తి శ్రద్ధలతో పాటిస్తున్నారు. ఈ క్రమంలో పార్వతీపురం బెలగాంలో ఉన్న పునీత కార్మిక జోజప్ప దేవాలయ దీక్షాపరులు బెలగాం నుంచి శివినిలో ఉన్న బాల యేసు దేవాలయం వరకు పశ్చాత్తాప పాదయాత్ర గురువారం ఉదయం 5గంటలకు నిర్వహించారు. పాదయాత్ర అనంతరం శివినిలో కతోలిక గురువులు అంథోని, కె.తోమస్‌రెడ్డి, దివ్య పూజాబలిని నిర్వహించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురం టౌన్: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు పెంచాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో బి.శ్రీధర్, ఎ.చిట్టిబాబు, టి.తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

నీలాకాశం..



పగలంతా ఎండ తీవ్రతతో అవస్థలు పడిన వీరఘట్టం పట్టణ వాసులకు గురువారం సాయంత్రం 6.30 గంటల సమయంలో మేఘావృతమైన నీలాకాశం కనువిందు చేసింది. ఈ దృశ్యాలను చాలా మంది తమ మొబైల్‌లో చిత్రీకరించారు. - వీరఘట్టం

భామినిలో వర్షం

భామిని: మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాల్లో గురువారం సాయంత్రం ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురిసింది. కొద్దిరోజులుగా ఉక్కబోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలు వర్షానికి సేదదీరారు. భామిని, బత్తిలి మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది.

చల్లబడిన వాతావరణం

పాలకొండ: మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం ఏడు గంటల పాటు ఓ మోస్తారు వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఎండ నుంచి ఉపశమనం పొందారు.



గుమ్మలక్ష్మీపురంలో కురుస్తున్న వర్షం



భామిని: నేరడిలో కురుస్తున్న వర్షం

వర్షంతో ఉపశమనం

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో గురువారం సాయంత్రం కొద్దిపాటి వర్షం కురిసింది. పగలంతా ఎండ తారెక్కించడంతో వేడెక్కిన వాతావరణం కురిసిన వర్షానికి చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది.

ఇళ్ల స్థలాల కోసం నిరసన



పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు రూ.5లక్షలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులతో కలిసి గురువారం నిరసన తెలిపారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, నిర్మాణాలకు సహకరించాలని, భూమి లేని నిరుపేదలకు సాగు భూములు పంచాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ డి.తిరుపతిరావుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఇంటికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాకులు గరుగుబిల్లి సూరయ్య, సింగన్న, బండి నేలమ్మ తదితరులు పాల్గొన్నారు. – గుమ్మలక్ష్మీపురం

వేతనదారుల నిరసన..



భామిని మండలం బిల్లుమడలో ఉపాధి వేతనదారులు గురువారం నిరసన చేపట్టారు. బిల్లులను సకాలంలో చెల్లించకపోవడాన్ని ఖండిస్తూ పనులకు వెళ్లలేదు. రెండు పూటలా పనులు చేస్తున్నా ప్రభుత్వం ప్రకటించిన రూ. 300 వేతనం రావడం లేదని వాపోయారు. వేతనదారుల నిరసన విషయాన్ని ఏపీఓ కె. కిశోర్ ఉపాధి అధికారులకు తెలియజేశారు. దీంతో ఈసీ రమణమూర్తి, టీఏలు శ్రీనివాస్, తేజేశ్వరరావు వచ్చి వేతనదారులతో మాట్లాడారు. మెరుగైన వేతనం వచ్చేలా కొలతలు తీస్తామని చెప్పినా వేతనదారులు శాంతించలేదు. పనులకు వెళ్లకుండా ఇంటిముఖం పట్టారు. – భామిని

స్థాయి పెంచాలి



పాలకొండ పట్టణ పరిధిలోని వెంకమ్మపేట ఇందిరానగర్ కాలనీలో గల హడ్కో కాలనీ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా స్థాయి పెంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక పాఠశాల వద్ద నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ.. జీఓ 117 ప్రాప్తికి విద్యార్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్పు చేయాలన్నారు. ఇప్పటికే సదరు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, భవనాల తాజా స్థితిగతులు, స్థాయి పెంపు ఆవశ్యకతను ఉన్నతాధికారులకు వివరించామన్నారు. ల్లలను చేర్పించాలంటూ పలు పాఠశాల్లో ఎంఈఓ నేతృత్వంలో తల్లిండ్రుల సమావేశాలు చేపట్టారు. – పాలకొండ రూరల్

యథావిధిగా కొనసాగించాలి

పాలకొండ రూరల్: మండలంలోని ఓని గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్ కోరారు. ఈ మేరకు డిప్యూటీ డీఈఓ పడ్రి కృష్ణమూర్తి, ఎంఈఓ కె.సోంబాబులను గురువారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. మోడల్ పాఠశాల పేరిట ప్రస్తుతం ఉన్న పాఠశాలకు మార్పులు, చేర్పులు చేయడం వల్ల భౌగోళికంగా ఏర్పడే ఇబ్బందులను గుర్తించాలన్నారు. గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహించే క్రమంలో అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కె.కూర్మినాయుడు తదితరులున్నారు.



డిప్యూటీ ఈఓ కృష్ణమూర్తికి వినతిపత్రం అందిస్తున్న వైస్ ఎంపీపీ సూర్యప్రకాష్

ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



నినాదాలు చేస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు, ఉద్యోగులు

- ఎన్‌ఎంయూ డిమాండ్

పాలకొండ రూరల్: ఆర్టీసీ సంస్థ ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎన్‌ఎంయూ జిల్లా కార్యదర్శి కె.శంకరరావు అన్నారు. రాష్ట్ర సంఘాల పిలుపు మేరకు గురువారం స్థానిక పాలకొండ డిపో వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాజమాన్యం నిరంకుశ వైఖరితో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. తమ భద్రతకు కేటాయించిన సర్క్యులర్ 01/2019ను అమలు చేయాలన్నారు. డిపో కార్యదర్శి, అధ్యక్షుడు వావిలపల్లి రాజేష్, ఎస్టీ రావు, తదితరులు మాట్లాడుతూ.. యాజమాన్యాలు వారి సొంత అజెండాతో ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడాన్ని తప్పుపట్టారు. కాలం చెల్లిన బస్సులతో సరీ్వసులు నడపడం, గ్యారేజీలో అవసరమైన స్పేర్ పార్ట్‌లను సమకూర్చకపోవడం, పూర్తిస్థాయి సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడం వల్ల కలిగే అనర్థాలు, పని ఒత్తిడిని వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ నాయకులు విజయరత్నం నాయుడు, దూబ రంగారావు, ఎంఆర్.మూర్తి, ఎంఎస్.నారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏటీడబ్ల్యూఓ కార్యాలయంలో ఆడిట్

సీతంపేట: మండల కేంద్రంలోని ఏటీడబ్ల్యూఓ కార్యాలయంలో అంతర్గత ఆడిట్ గురువారం నుంచి జరుగుతోంది. ఆడిట్ ప్రతినిధులు వివిధ రికార్డులను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే మందస, మెళియాపుట్టి ఏటీడబ్ల్యూఓ కార్యాలయాల్లో ఆడిట్‌ను పూర్తి చేశారు.